క్లుప్తంగా

మెగా రక్తదాన శిబిరం



మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఆదిత్య చైర్మన్, సిబ్బంది

గండేపల్లి: అత్యధిక యూనిట్ల రక్తం దానం చేసే ఉత్తమ సంస్థగా ఆదిత్య విద్యాసంస్థలు గుర్తింపు తెచ్చుకున్నట్టు కళాశాలల వైస్ చైర్మన్ ఎన్.సతీష్ రెడ్డి తెలిపారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 819 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదాతలను ఆదిత్య కళాశాలల చైర్మన్ ఎన్.శేషారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా కళాశాలల వైస్ చైర్మన్ ఎన్.సతీష్ రెడ్డి మాట్లాడుతూ రక్త సేకరణకు సంబంధించి రాష్ట్ర మాజీ గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నట్టు తెలిపారు. కళాశాలలో మరిన్ని రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ, ప్రైవేటు బ్లడ్ బ్యాంక్‌లకు రక్తాన్ని అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస రెడ్డి, ఆదిరెడ్డి రమేష్, డోలా సంజయ్, కె. రవి శంకర్, డి.సతీష్ కుమార్, సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



పెద్దిపాలెంలో ర్యాలీ చేస్తున్న అధికారులు

ప్రత్తిపాడురూరల్: మండలంలోని పెద్దిపాలెంలో ప్రకృతి వ్యవసాయంపై బుధవారం రైతులు, మహిళా సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ అధికారులు ప్రకృతి వ్యవసాయ విధానంలో నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. అనంతరం 'నవధాన్యాల సాగు-నేలతల్లి బాగు' అనే నినాదంతో గ్రామంలో ర్యాలీ చేశారు. ఏపీ సీఏఎస్ఎఫ్ ఐబీఎస్‌డీఏ ఎం.మల్లేశ్వరి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సత్యనారాయణ

కోటనందూరు: విశ్వమానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని బొద్దవరంలో బుధవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థ వైద్యుడు సత్యనారాయణ 85 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి నెలా మూడో బుధవారం నిర్వహించే హోమియో వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ ప్రతినిధులు కోరారు. రామకృష్ణా సేవా సమితి ప్రతినిధులు రోగులకు సేవలందించారు.

ఉపాధి పనుల పరిశీలన



బూరుగుపూడిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

కిర్లంపూడి: మండలంలోని బూరుగుపూడిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ఉపాధి ఏపీఓ బి.చిరంజీవిరావు పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఎండలు ముదురుతున్నందున ఉపాధి కూలీలకు వాటర్, దేరాలు వేసి నీడను ఏర్పాటు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరూ సచివాలయానికి వెళ్లి తమ జాబ్ కార్డుకు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేయించుకోవాలని సూచించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ఉపాధి పనులపై ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

సర్వే రాళ్ల పంపిణీ వేగవంతం

కాకినాడ సిటీ: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష సర్వేకు సంబంధించి రీసర్వే ముగిసిన గ్రామాల్లో భూమి సరిహద్దులు తెలిపే సర్వే రాళ్ల పంపిణీ వేగవంతం చేయాలని ఆర్డీవో బీవీ రమణ అన్నారు. బుధవారం కాకినాడ డివిజనల్ స్థాయి తహసీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా రైతులను సమాయత్తం చేయాలని, సర్వే రాళ్లకు సంబంధించి రోజువారీ లక్ష్యాలు నిర్దేశించుకోవాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియ వేగంగా ముగించాలన్నారు.

పాడి రైతులకు కొండంత అండ

- రేఖవానిపాలెంలో బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్
- పది మండలాలకు అనుసంధానంగా ఏర్పాటు చేస్తున్న అధికారులు
- రైతులకు గిట్టుబాటు ధర



రేఖవానిపాలెంలో బీఎంసీ పనులను పరిశీలిస్తున్న పశు సంవర్ధకశాఖ ఏడీ శ్రీధర్

తుని రూరల్: మహిళా డెయిరీ అసోసియేషన్ కేంద్రం ఆధ్వర్యాన మెట్ట ప్రాంతంలో జగనన్న పాల వెల్లువ పరుగులు తీయనుంది. ప్రైవేట్ డెయిరీల దోపిడీని అడ్డుకుని, పాడి రైతుల కష్టాలనికి తగ్గట్టు గిట్టుబాటు ధర చెల్లించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ×జగనన్న పాల వెల్లువ×ను తీసుకువచ్చింది. దీనిలో భాగంగా పాల సేకరణ, నిల్వకు పశు సంవర్ధకశాఖ అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో ఆరు, అనకాపల్లి జిల్లాలో నాలుగు మండలాల్లో సేకరించిన పాలను నిల్వ చేసేందుకు తుని మండలం రేఖవానిపాలెంలో 50 వేల లీటర్ల నిల్వ సామర్థ్యం గల బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మార్చి నెలాఖరుకు పనులు పూర్తి చేసి ఏప్రిల్ మొదటి వారంలో బీఎంసీను ప్రారంభించనున్నట్టు పశు సంవర్ధకశాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికే అమూల్ పాల డెయిరీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడంతో పాడి రైతులు సరఫరా చేసే పాలకు మంచి గిట్టుబాటు ధర లభించనుంది.

మహిళల ఆధ్వర్యంలో నిర్వహణ

జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో మహిళలదే కీలకపాత్ర. మహిళా డెయిరీ అసోసియేషన్ కేంద్రం (ఎండీఏసీ) ఆధ్వర్యంలో పాల సేకరణ జరుగనుంది. ఇందుకుగాను ప్రతి గ్రామంలోనూ మహిళా కార్యదర్శి, సహాయ కార్యదర్శులను నియమిస్తున్నారు. కార్యదర్శి, సహాయ కార్యదర్శులకు సేకరించిన లీటరు పాలకు రూపాయి చొప్పున కమీషన్ లభిస్తుంది. కాకినాడ జిల్లా తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి, గొల్లప్రోలు మండలాల్లోని 78 గ్రామాల్లో ప్రతిరోజూ పాలను సేకరించనున్నారు. కాకినాడ జిల్లాలో ఆరు మండలాలతో పాటు అనకాపల్లి జిల్లా నాతవరం, పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో సేకరించిన పాలను తుని మండలం రేఖవానిపాలెంలో నిల్వ చేయనున్నారు. ఇందుకుకోసం రేఖవానిపాలెంలో 50 వేల లీటర్ల నిల్వ సామర్థ్యం గల బల్క్ మిల్క్ సెంటర్‌ను నెలకొల్పారు. అన్ని మండలాల నుంచి రవాణా సదుపాయం ఉండడంతో రేఖవానిపాలెంలో బీఎంసీ ఏర్పాటు చేశారు.

పాల ధరలు ఇలా..

పాలు రకం	పాలలో కొవ్వుశాతం	లీటరు ధర
గేదె పాలు	9-11	రూ.87.52
ఆవు పాలు	5.4-8.7	రూ.42.46



రేఖవానిపాలెంలో ఏర్పాటు చేస్తున్న బల్క్ మిల్క్ సెంటర్

ఏప్రిల్ నుంచి పాల సేకరణ



ఏప్రిల్ మొదటి వారంలో బీఎంసీ ప్రారంభమవుతుంది. అప్పటి నుంచి కాకినాడ జిల్లాలో 78 గ్రామాల నుంచి పాల సేకరణ చేపడతాం. అమూల్ డెయిరీతో ప్రభుత్వం ఒప్పందం చేయడంతో ఇతర డెయిరీల కంటే అధనంగా పాల ధర రైతులకు లభిస్తుంది. రోజు 50 వేల లీటర్ల పాల సేకరణ లక్ష్యం. అందులో పది వేల లీటర్లను స్థానిక అవసరాలకు కేటాయించి, మిగిలిన 40 వేల లీటర్ల పాలను అచ్చుతాపురంలోని యూనిట్‌కు తరలిస్తాం. పాడి రైతులను చైతన్య పర్చేందుకు అమూల్ డెయిరీ రూట్ ఆఫీసర్ పర్యవేక్షణలో మహిళా డెయిరీ అసోసియేషన్ సభ్యులు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. పాల సేకరణ, పాలలో కొవ్వు శాతం, గిట్టుబాటు ధరలపై సమగ్రంగా వివరిస్తున్నారు. జగనన్న పాల వెల్లువతో పాడి రైతులకు మేలు జరుగుతుంది.

– డాక్టర్ వడ్డి శ్రీధర్, పశు సంవర్ధకశాఖ ఏడీ, తుని

సీఐ కౌన్సెలింగ్‌తో ఒక్కటైన ప్రేమ జంట



ఆలయంలో ఒక్కటైన ప్రేమజంట

ప్రత్తిపాడు: స్థానిక సీఐ కె.కిషోర్‌బాబు కౌన్సెలింగ్ ఇవ్వడంతో ప్రేమ జంట ఒక్కటయ్యారు. వివరాల్లోకి వెళితే... చినశంకర్లపూడి గ్రామానికి చెందిన కోరాడ నాని, అదే గ్రామానికి చెందిన లోండ నాగ శైలజ ప్రేమించుకున్నారు. నాని పెళ్లి చేసుకుంటానని నాగ శైలజను నమ్మించి, ఆమె గర్భం దాల్చిన తర్వాత మొహం చాటేశాడు. ఆమెకు, తనకు సంబంధం లేదంటూ బుకాయించాడు. దీంతో నాగ శైలజ మంగళవారం ప్రత్తిపాడు పోలీసులను ఆశ్రయించింది. నాగ శైలజకు జరిగిన అన్యాయంపై స్పందించిన సీఐ కె.కిషోర్ బాబు కోరాడ నాని కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రేమికులకు వివాహం జరిపించేందుకు నాని కుటుంబ సభ్యులను, బంధువులను ఒప్పించారు. దీంతో మండలంలోని చినశంకర్లపూడి గ్రామ దేవత దుర్గాదేవి ఆలయంలో బుధవారం గ్రామ పెద్దల సమక్షంలో ప్రేమ జంటకు వివాహమైంది. వివాదాన్ని సర్దుబాబు చేసి నాగశైలజకు అండగా నిలిచిన సీఐ కె కిషోర్‌బాబుకు ఇరువర్గాల వారు కృతజ్ఞతలు తెలిపారు.

వీహెచ్‌పీని బలోపేతం చేయాలి



వీహెచ్‌పీ నాయకులను సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఏలేశ్వరం: విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ)ను బలోపేతం చేయాలని ఆ సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి శివకుమార్ సూచించారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా బుధవారం ఆయన పట్టణంలోని సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా హిందూ ధర్మానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. సనాతన ధర్మాన్ని ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. విశ్వమంతా గుర్తింపు పొందిన వీహెచ్‌పీకి గ్రామా గ్రామాన సత్సంగాలను ఏర్పాటు చేయాలన్నారు. హిందువులు ఏకమై దేశ ఐక్యతకు కృషి చేయాలన్నారు. అనంతరం సంఘ జిల్లా కార్యదర్శి చిక్కా సత్యనారాయణ, శివశంకర్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ అధ్యక్ష, కార్యదర్శులు అలమండ దుర్గావెంకటప్రసాద్, కటకం కిరీటీ, తూమురౌతు గురయ్య, కందుల ప్రభాకర్, వాగు కల్యాణి, రమణ, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా స్వామి, అమ్మవార్లు

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెను చేశారు. తొలుత ఆలయ అర్చకుడు వై.రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 16న స్వామివారి కల్యాణం, 18న మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, లింగోద్భవ కాలపంచామృత అభిషేకాలు, 19న గ్రామోత్సవం, పండిత సదస్యం, 20న త్రిశూల స్నానం, శ్రీపుష్పయాగం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.




స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు రామకృష్ణమూర్తి

రూ.40 లక్షలతో బ్రాహ్మణరేవు ఆధునీకరణ

- చురుగ్గా జరుగుతున్న పనులు
- మహాశివరాత్రికి భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు

ఏలేశ్వరం: మహాశివరాత్రిని పురస్కరించుకుని స్థానిక ఏలేరునది వద్ద (బ్రాహ్మణరేవు) స్నానాల రేవు ఆధునీకీకరణ పనులు వేగవంతం జరుగుతున్నాయి. మహా పుణ్యక్షేత్రమైన స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఏలేరు నది ఉండగా దానిని ఆనుకుని బ్రాహ్మణరేవు ఉంది. ఏటా మహాశివరాత్రి చుట్టుపక్కల, ఏజెన్సీ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు బ్రాహ్మణరేవులో స్నానాలు ఆచరిస్తారు. దీంతో నగర పంచాయతీ ఆధ్వర్యంలో బ్రాహ్మణ రేవును 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.40 లక్షలతో ఆధునీకరిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం రేవు వద్ద పలు అభివృద్ధి పనులు చేపట్టారు.



బ్రాహ్మణరేవు వద్ద నిర్మిస్తున్న అండర్ డ్రైనేజీ

పలు నిర్మాణాలు

బ్రాహ్మణ రేవును ఆనుకుని శ్మశానవాటిక ఉంది. మహాశివరాత్రికి బ్రాహ్మణరేవు వద్ద పిండ ప్రదానాల నిమిత్తం షెడ్డు నిర్మించారు. కొన్నేళ్లుగా పట్టణంలోని మురుగునీరు ప్రధాన కాలువ ద్వారా ఈ రేవులో కలుస్తోంది. దీంతో ఈ రేవులో స్నానాలు చేయాలంటే భక్తులు ఇబ్బందులు పడేవారు. దీంతో మురుగునీరు రాకుండా రేవును ఆనుకుని అండర్ డ్రైనేజీను నిర్మిస్తున్నారు. రేవులోని మెట్లకు టైల్స్ వేస్తున్నారు. దీంతో భక్తులకు ఇబ్బందులు తొలగనున్నాయి. మహిళా భక్తులు స్నానాల అనంతరం దుస్తులు మార్చుకొనేందుకు తాత్కాలిక గదులు ఏర్పాటు చేస్తున్నారు. రేవును అభివృద్ధి చేయడంతో భక్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



పిండప్రదానాల నిమిత్తం నిర్మించిన నూతన షెడ్



మెట్లకు టైల్స్ వేస్తున్న దృశ్యం

భక్తులకు మెరుగైన వసతులు



భక్తులు సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ఆధునీకీకరణ పనులు చేపట్టాం. ప్రస్తుతం శివరాత్రి పుణ్యస్నానాలకు వచ్చే భక్తులు, కార్తిక మాసంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాం.

–అలమండ సత్యవతి, చైర్‌పర్సన్, నగరపంచాయతీ, ఏలేశ్వరం

ఇబ్బందులు తొలగుతాయి



భక్తుల సౌకర్యార్థం స్నానాల రేవును ఆధునీకరిస్తున్నాం. దీంతో భక్తులకు ఇబ్బందులు తొలగుతాయి. రేవు వద్ద భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– కేపీ కొండలరావు కమిషనర్, నగర పంచాయతీ ఏలేశ్వరం

ప్రమాదకరంగా వంతెనలు

- తరచూ ప్రమాదాలు
- ఆందోళన చెందుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



బురదకాలువపై రక్షణ గోడలు లేకుండా ప్రమాదకరంగా ఉన్న వంతెన

గోకవరం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో వంతెనలు శిథిలమై ప్రమాదకరంగా మారాయి. గోకవరం ఠాణాసెంటర్‌లో ఊరకాలువపై ఉన్న వంతెనతో పాటు రంపయర్రంపాలెం వెళ్లే గ్రామంలో బురదకాలువపై ఉన్న వంతెనల వద్ద ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఠాణాసెంటర్‌లో ఊరకాలువపై ఉన్న వంతెన బ్రిటిషు కాలం నాటిది. వంతెన ఇరుకుగా ఉండటం, బ్రిడ్జికి ఇరువైపులా భారీ మలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గత పదేళ్లుగా ఈ వంతెనపై జరిగిన ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడగా, అనేక మంది గాయాలపాలయ్యారు. దీంతో ఈ వంతెన మీదుగా వెళ్లెందుకు ప్రయాణికులు తీవ్ర భయాందోళ చెందుతున్నారు. ఇటీవల వంతెన రక్షణ గోడ సైతం శిథిలావస్థకు చేరింది.

వేలాది వాహనాల రాకపోకలు

రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం వైపు, వివిధ రాష్ట్రాలకు నిత్యం వందలాది వాహనాలు ఈ వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెనపైకి ఒకేసారి రెండు వాహనాలు వస్తే ట్రాఫిక్ నిలిచిపోయి నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో ఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు నిత్యం పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరేళ్ల క్రితం ఈ వంతెన నిర్మాణానికి టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాకపోవడంతో వంతెన నిర్మాణం జరగలేదు. అలాగే గోకవరం శివారున రంపయర్రంపాలెం వెళ్లే మార్గంలో బురదకాలువపై ఉన్న వంతెన ప్రమాదభరితంగా మారింది. ఈ వంతెనను సుమారు 30 సంవత్సరాల క్రితం నిర్మించారు. వంతెన నిర్మించిన సమయంలో వంతెనకు ఇరువైపులా సిమ్మెంటు దిమ్మలను రక్షణగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వంతెనపై పలు చోట్ల సిమ్మెంటు దిమ్మలు శిథిలావస్థకు చేరి కూలిపోయాయి. దీంతో వంతెనపై ప్రయాణం దినదినగండంగా మారింది. ఇప్పటివరకూ ఈ వంతెనపై నుంచి కింద పడి ముగ్గురు వక్తులు మృత్యువాత పడ్డారు. అలాగే పలు వాహనాలు అదుపుతప్పి కాలువలోకి దూసుకువెళ్లిన సంఘటనలు ఉన్నాయి. నిత్యం ఈ వంతెనపై రంపయర్రంపాలెం, గంగంపాలెం, ఠాకూరుపాలెం, తిరుమలాయపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన ప్రమాదభరితంగా మారడంతో వీరు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఠాణాసెంటర్ వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మించాలని, బురదకాలువపై వంతెనకు రక్షణగోడలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



గోకవరంలో ప్రమాదకరంగా ఉన్న ఠాణాసెంటర్ ఇరుకు వంతెన

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

రౌతులపూడి: మండలంలోని మెరక చామవరంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు తునికి చెందిన నాసా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు చేయూతనందించారు. బాధితులు పి.వరలక్ష్మి, పి.లోవలక్ష్మి, ఎన్.అప్పారావు, జి.రామలక్ష్మి కుటుంబాలకు ఒక్కొక్కరికి పది కిలోలు చొప్పున బియ్యం, దుస్తులు, కిరాణా సామగ్రి సంస్థ ప్రతినిధి ఎస్.సుజీత్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అడపా సత్యవాణి మురళి, ఎ.వీరబాబు, ఎ.వీరబుల్లి, నాసా ప్రతినిధి దొంగబాబు తదితరులు పాల్గొన్నారు.

జి.కొత్తపల్లిలో..

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులైన పెద్దాడ చంటమ్మ, నురుకుర్తి నాగలక్ష్మి కుటుంబాలకు నాసా స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు, దుప్పట్లు, దుస్తులు, నగదు అందజేశారు. బాధితులకు ప్రభుత్వంతో పాటు మిగతా స్వచ్ఛంద సేవా సంస్థలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈగల విజయదుర్గ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఈగల అప్పారావు, నాసా ప్రతినిధి ఎస్.సుజిత్, ఎడ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మెరక చామవరంలో బాధితులకు బియ్యం, కిరాణా సామగ్రి అందజేస్తున్న నాసా సంస్థ ప్రతినిధులు

ప్రతి సచివాలయానికి ఫిష్ యూనిట్

శంఖవరం: ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి సచివాలయానికి ఫిష్ యూనిట్(దుకాణం) ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా మత్స్య ఏడీ కె.శ్రావణకుమారి తెలిపారు. స్థానిక మహిళా సాధికారిక కార్యాలయంలో బుధవారం మహిళా సంఘాలతో ఆమె సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం మహిళలు, యువతను ప్రోత్సహించేందుకు ఫిష్ యూనిట్లను ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రతి యూనిట్‌కు రూ.1.75 లక్షలు రుణ సదుపాయం కల్పిస్తుందన్నారు. బీసీ, జనరల్ వర్గాలకు 40 శాతం రాయితీ, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం రాయితీ ఇస్తున్నట్టు చెప్పారు. దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు స్త్రీ నిధి ద్వారా రుణాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు ఫిష్ యూనిట్‌పై అవగాహన కల్పిస్తున్న మత్స్య ఏడీ శ్రావణకుమారి

తెగుళ్ల నివారణతో నాణ్యమైన దిగుబడులు

తుని రూరల్: మామిడి సాగు చేసిన రైతులు సకాలంలో తెగుళ్లు, పురుగులను నివారిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని కాకినాడ జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ అన్నారు. మండలంలోని డి.పోలవరం, దొండవాక, కేఓ మల్లవరం గ్రామాల్లో తుని ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మితో కలసి బుధవారం ఆయన పర్యటించారు. పూత, పిందెలపై ఉన్న మామిడి తోటల్లో కాయపుచ్చు పురుగు, తామర పురుగు, ఆకు జల్లెడ పురుగు, పండు ఈగ, తేనె మంచు పురుగు, ఆకుమచ్చ తెగులు, మసి తెగులు, పక్షి కన్ను తెగులు, బంక తెగులు ఉన్నట్టు గుర్తించామన్నారు. తెగుళ్ల నివారణకు రైతులు మండలస్థాయి ఉద్యాన అధికారుల సూచనలు, సలహాలతో తగిన మోతాదులో మందులను పిచికారీ చేయాలన్నారు. శాస్త్రీయ పద్ధతులతో తెగుళ్లు, పురుగులను నివారించి ఎగుమతులకు అనువుగా నాణ్యమైన మామిడి దిగుబడులు సాధించాలన్నారు. మోతాదు మించి మందులు వాడితే మామిడి కాయలు, పండ్లు తినేవారిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. మామిడి తోటల్లో మందులు పిచికారీ చేసే రైతులు, కూలీలు మాస్కులు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



దొండవాకలో రైతులతో కలసి మామిడి పూతను పరిశీలిస్తున్న ఏడీహెచ్ రమణ, హెచ్ఓ విజయలక్ష్మి

రాజకుమార్‌రెడ్డికి డాక్టరేట్

కాకినాడ రూరల్: తిమ్మాపురంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్ రాజనీతి, ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగంలో అతిథి అధ్యాపకుడిగా పనిచేస్తున్న పల్లాల రాజకుమార్ రెడ్డి ఆంధ్ర యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్ర విశ్రాంత ఆచార్యులు ఆచార్య పి.అరుణ్‌కుమార్, డాక్టర్ పి.ప్రేమానందం పర్యవేక్షణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్థానిక సంస్థల్లో గిరిజనుల రాజకీయ ప్రాతినిధ్యం అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో బుధవారం రాజకుమార్‌రెడ్డిని విభాగాధిపతి డాక్టర్ కె.జోసఫ్ స్టీఫెన్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డాక్టర్ కమల కుమారి, సహాయ ఆచార్యులు సత్యనారాయణ, నానిబాబు, హరిబాబు, గోపి, హైకోర్టు న్యాయవాది సన్నపు కుమారస్వామి, లలితకుమారి, రాజ్‌కుమార్, విద్యార్థినీ విద్యార్థులు శాలువాతో సత్కరించి అభినందించారు.